టింధితులు నా మిత్రులు ఎంతోమంది
మగ్గుతున్నారు.
తొందరపడకు గాలియా !
నా చెవి దగ్గర ఎత్తకు ప్రేమ గాథలు,
ఇంక నానుంచి ఆశించకు కమనీయ
కల్పనలు,
ఇంత తొందరెందుకు గాలియా?
అసలు బిడారు తిరిగి వచ్చేదాకా మనము
వేచి ఉండక తప్పదు !
స్వచ్ఛమైన స్ఫటిక బాహువులను చాచి ఉషస్సు
నిశీధి నల్ల తెరలను విచ్చుకత్తులతో చించి
తునాతునకలుగా కుప్పపోసే రోజు,
కిటికీ కిటికీల్లో నుంచి
ఉదయ సూర్యకాంతులు దూసుకొని
వస్తున్నప్పుడు
నా కామ్రేడ్స్ అందరి ముఖాలు హాసభాసుర
మైనప్పుడు
నీకోసం సఖీ, నేనే పనికట్టుకొని వస్తాను
పద్యాలు, ముద్దులు మురిపాల మల్లీవల్లీ
వల్లరుల మధ్యన కూర్చుని
చెప్పని ప్రేమగాధలను చెబుదువు గాని.

[ఏల్చూరి సుబ్రహ్మణ్యం ఆంధ్రానుసరణం]

# పాలస్తీనా కవిత

## మహమ్మద్ దర్వీష్

*ఇంటింటా దీపాలు వెలిగించకపోతే*
*మన కవితకు లేదు రంగు,*
*లేదు రుచి, లేదు ధ్వని*

**కథానిక**

# "ది ట్రిక్"

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

ఆడవాళ్ళకి సిగరేట్స్ తాగే మొగాళ్ళంటే ఇష్టం ఎక్కువగా వుంటుందనే అభిప్రాయం నేను కాలేజీలో చదువుకునే రోజుల్లోనే ఏర్పడింది. మొగవాళ్ళకి లిప్ స్టిక్ పెదాలకి రాసుకునే ఆడవాళ్ళంటే ఆకర్షణ ఎక్కువగా వుంటుందన్న అభిప్రాయం కూడా అప్పుడే ఏర్పడింది.

చెల్లాయ్ కూడా ఓసారి హోటల్లో బయట పడింది నా ముందు.

"మొగాళ్ళు నీట్‌గా టక్ చేసుకొని, సాయంత్రం రద్దీగా వుండే సెంటర్‌లో నిలబడి, సిగరెట్ తాగుతూ, రింగులు వదులుతుంటే మా క్లాస్‌మేట్స్ చాలామందికి వాళ్ళు చిన్న సైజు హీరోల్లా అగుపిస్తారు'' అన్నది. నిజమే ననుకున్నాను.

చెల్లాయ్‌కి పెళ్ళయి మూడు నెలలయింది. బావ గారు ఒక టుబాకో కంపెనీ ఫ్యాక్టరీలో టెక్నీషియన్. ఆయన చాలా మంచివాడు. చెడ్డ అలవాట్లేమీ లేవు, ఒక్క సిగరెట్స్ తప్ప.

'చెడ్డ అలవాటు' అని నేనంటం లేదు. పెళ్ళయి వారం రోజులు దాటాకటచెల్లాయి ఓసారి నాతో అన్నది:

"రెండు సంవత్సరాల క్రితం అలవాటయింది ఆయనకి సిగరెట్స్ కాల్చటం, వాళ్ళ కంపెనీ వాళ్ళు సంవత్సరాని కిన్నని సిగరెట్ పెట్టెలు వుచితంగా ఇస్తారు. అవి చాలక బయట కొంటారు.''

"చిన్న సైజు హీరో అన్న మాట'' అన్నాను నవ్వి.

"ఛీ, ఇదో చెడ్డ అలవాటు, బయట వాళ్ళు ఎవరయినా సిగరెట్ తాగుతూంటే చూడటానికి బావుంటుంది కాని, మన భర్త అనుకున్న మనిషి కాలుస్తే సహించలేను. పాడు వాసన. ఎలాగైనా మాన్పించాలి అయ్యగారి చేత."

ఆడవాళ్ళ పెదవులకుండే లిప్ స్టిక్ సంగతి కూడా ఇంతే నేమో? 'నా భార్య' అనుకున్న వ్యక్తి పెదాలకి రంగు పూస్తే నేను పూరుకుంటానా, సరిపెట్టుకొంటానా అన్న విషయం తేల్చుకోడానికి నాకింకా పెళ్ళి కాలేదు.

రెండు మూడు రోజులకో సారి చెల్లాయ్ ఇంటికి వెళ్తూండే వాడిని, వెళ్ళినప్పుడల్లా బావ గారు, "మీ చెల్లాయ్ సిగరెట్స్ మానమని చంపేస్తోందండి, భరించలేక పోతున్నాను ఈ పోరు" అంటూండే వారు.

"మీరు మానా లనుకుంటే ఇప్పుడే మానడం మంచిది. ఇంకో రెండు మూడు సంవత్సరాలు ఆగితే వాటికి పూర్తిగా బానిస అయిపోయే ప్రమాదం వుంది" అని హెచ్చరిస్తూ, మానేయటం వుత్తమం అని సలహా ఇస్తూండే వాడిని.

చెల్లాయ్, బావగారు చివరకి ఓ రాత్రి పేకాట ఆడుతూ ఒక నిర్ణయానికి వచ్చారు, చెల్లాయ్ వత్తిడి ఎక్కువవటం వల్ల. రోజూ పేక ముక్కలు కలుపు తుంది చెల్లాయ్. బావ గారు కట్ చేసి ఓ ముక్క తీస్తారు. ఆ పేక ముక్క ఏ సంఖ్యను సూచిస్తే అన్ని సిగరెట్లు మాత్రమే త్రాగాలి ఆ రోజు. ఉదయం కాఫీ కప్పుతోబాటు చెల్లాయ్ పేక బొత్తిని కూడా తీసుకెళ్తూండేది బావ గారి గదిలోకి.

ఒకసారి ఆసు వచ్చేది. ఒకటే కాల్చాలి ఆ రోజు. ఒకోసారి కింగ్ వచ్చేది. డజను తగలెయ్యొచ్చు ఆ రోజు. రెండు, మూడు, పదీ ఇలా ఒకో రోజూ ఒకో ముక్క తీస్తూండే వారు. చెల్లాయ్ మీద ప్రేమో, ఆయనకే సిగరెట్స్ మానాలనే కోరిక కలిగిందో తెలియదు కాని, పేక ముక్క ప్రకారం ఎక్కువో, తక్కువో, అన్నే కాల్చేవారు.

ఈ విధంగానే సంవత్సరం గడిచింది. నెలలు గడిచేకొద్దీ బావ గారి అదృష్టం తరిగి పోయింది. ఎప్పుడో గాని అయిదు సంఖ్య దాటేది కాదు ఆయన స్వయంగా తీసే ముక్క. మధ్యలో పండగ వొస్తే, ఆ రోజు అసలే కాల్చనిచ్చేది కాదు. దగ్గరే కూర్చుని, ఆయనకి సిగరెట్ కాల్చే టైమ్‌కి తలనొప్పి వచ్చినప్పుడల్లా, ఏవేవో కబుర్లు చెప్తూ మరిపిస్తూండేది.

సంవత్సరన్నర అయింది చెల్లాయ్ పెళ్ళయి. రెండు అభివృద్ధులు సాధించింది. ఇప్పుడు బావ గారు పూర్తిగా సిగరెట్స్ కాల్చడం మానేసారు. తండ్రి అయారు.

ఓ రోజు మాటల్లో యదాలాపంగా చెల్లాయ్ ఓ నిజాన్ని చెప్పింది నాకు. తర్వాత నాలిక కొరుక్కుంది తన మోసం బయట పెట్టు కున్నందుకు.

"చివరి ఎనిమిది నెలలు అయితే పేక బొత్తిలో అన్నీ రెండు, మూడు, నాలుగు, అయిదు సంఖ్య లుండే పేక ముక్కల్ని మాత్రమే వుంచేదాన్ని. ఆ పై సంఖ్యల ముక్కలు అసలుంచేదాన్ని కాదు. అందు కోసం ఒకే రకం పేకలు చాలా కావాల్సి వచ్చింది."

చెల్లాయ్, బావ గారు పడ్డ అవస్థ స్వయంగా చూసాను కనుక, ఇప్పు డెవరయినా సిగరెట్ ఆఫర్ చేసినా కూడా, 'నో, థాంక్స్' అని తప్పించుకుంటున్నాను. అలా ఆఫర్స్‌తోనే మొదలయింది బావగారి కా అలవాటు మొదట్లో మరి.

న్యాయానికి తావులేని చోట ప్రజల సంకెళ్ళు మార్పు అవుతాయే గాని, వారి భవిష్యత్తులో మార్పు వుండదు.

రాజస్పేర్